
సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

రాష్ట్రాల హక్కులు హరించే 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' విధానం

- నియోజకవర్గాల పునర్విభజన పెద్ద కుట్ర
- అసెంబ్లీలో నిప్పులు చెరిగిన సీఎం

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' విధానం రాజ్యాంగవిరుద్ధమని, దీనివల్ల రాష్ట్రాల హక్కులు హరించుకుపోవడం ఖాయమని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేయాలన్న లక్ష్యంలో భాగంగానే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నారని ధ్వజమెత్తారు. తాజా జనగణన ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న ఆలోచన కూడా పెద్ద కుట్ర అని, అదే జరిగితే దక్షిణాదిన.. ముఖ్యంగా తమిళనాడులో ఎంపీ స్థానాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు 39 మంది ఎంపీలుంటేనే తమిళనాడు గురించి పట్టించుకోని కేంద్రపాలకులు.. ఆ సంఖ్య తగ్గితే లెక్కచేయబోరని హెచ్చరించారు. అందుకే దీనిని యావద్దేశం ఖండించాల్సిన అవసరముని పిలుపునిచ్చారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని వ్యతిరేకిస్తూ, తాజా జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనను ఖండిస్తూ బుధవారం అసెంబ్లీలో తీర్మానాలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి.. ఈ సందర్భంగా సుదీర్ఘంగా ప్రసంగించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్య ప్రాతిపదికకు విరుద్ధమని, ఈ అంశం రాజ్యాంగంలో పొందుపరచలేదన్నారు. నియోజకవర్గాల పునర్విభజనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించకూడదని, దాని పేరుతో తమిళనాడు ప్రజా ప్రతినిధుల సంఖ్యను తగ్గించేందుకు కేంద్రం పన్నుతోందన్నారు. ఈ రెండు వివాదాస్పద నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమన్నారు. ఈ అంశాల్లో రాజకీయాలను పక్కనబెట్టి సభ్యులంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఒకే విధానం రాజ్యాంగ విరుద్ధం...

'ఒకే దేశం - ఒకే ఎన్నిక విధానం రాజ్యాంగంలో చెప్పిన స్వాతంత్ర్యం, స్వేచ్ఛ అనే పదాలకు పూర్తి విరుద్ధం. ఈ విధానం అమలుకు వస్తే ప్రజలచే ఎన్నుకోబడిన అసెంబ్లీలు ముందుగానే రద్దు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. ఈ ఎన్నికల ద్వారా అన్ని రాష్ట్రాల్లో పాగా వేయాలని బీజేపీ కుట్ర పన్నింది. అలాగే బీజేపీ అధికారం లేని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను కూల్చివేసి ఎన్నికలను నిర్వహిస్తే కేంద్రంలో మళ్లీ అధికారంలో వున్న ప్రభుత్వమే గెలిచే అవకాశముంది. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుంది. పార్లమెంటు, అసెంబ్లీలకే కాక స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపాల్సిన పరిస్థితి కూడా వస్తుంది. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలను ఒకేరోజు పూర్తి చేసే స్థాయి, సామర్థ్యం లేదు. ఈ పరిస్థితుల్లో 30 రాష్ట్రాలకు, దేశంలోని అన్ని పార్లమెంటు స్థానాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడమంటే ఇంద్రజాలం కాక మరేమిటి? కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు. దీనిని రాజ్యాంగం కూడా ఆమోదించింది. అందువల్ల ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం వస్తే స్థానిక సంస్థల అభివృద్ధి అనేది శూన్యమైపోతుంది. ఇప్పటి వరకూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా వున్న పంచాయతీలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే ఎన్నికలు జరిపి, వాటి అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుస్తున్నాయి. అయితే కేంద్రం ఈ విధానాన్ని కూడా ఎత్తివేయాలని కుట్ర పన్నింది. పార్లమెంటులో మెజారిటీలో ఉన్న పార్టీని చూసి ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదు" అని స్టాలిన్ పేర్కొన్నారు.

తలపై వేలాడే కత్తి...

ఇంకా సీఎం మాట్లాడుతూ... 'నియోజకవర్గాల పునర్విభజన పథకం తమిళనాడుపై, దక్షిణాది రాష్ట్రాల తలపై వేలాడే కత్తిలాంటిది. భారత రాజ్యాంగంలోని 82, 177 సెక్షన్ల కింద జనగణన పూర్తి చేసిన అనంతరం పార్లమెంటుకు, శాసనసభల్లో కొత్త స్థానాలను రూపొందించాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఉన్న స్థానాలను తగ్గించాలన్న ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ప్రస్తుతం తమిళనాడు నుంచి 39 మంది ఎంపీలుంటేనే డిమాండ్లను పట్టించుకోవడం లేదు. గతంలో నియోజకవర్గాల పునర్విభజన పేరుతో స్థానాల సంఖ్యను తగ్గించకూడదని కేంద్రప్రభుత్వాలకు పలుమార్లు చెప్పాం. అయితే దీనిని పరిశీలించకుండానే జనాభా సంఖ్య కారణం చూపి, దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్యను తగ్గించాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పక్షపాత ధోరణి వల్లే రాష్ట్రానికినిధులను కేటాయించడంలో, పథకాలు అమలు చేయడంలో కేంద్రం చిన్న చూపు చూస్తోంది. 2026 తరువాత కులగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చర్యలు విడనాడాలి. ఇందుకు మనమంతా ఒత్తిడి తీసుకురావాలి. ఈ రెండు అంశాలను వ్యతిరేకిస్తూ తీర్మానాలను ఆమోదించాలి' అని సీఎం సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

రెండు తీర్మానాలు ప్రవేశపెట్టిన స్టాలిన్

సీఎం ప్రసంగం ముగియగానే ఆ తీర్మానాలను ఆమోదిస్తూ సభ్యులంతా బల్లలు చరిచారు. దీంతో మూజువాణీ ఓటుగా ఆ తీర్మానాలు ఏకగ్రీవంగా నెరవేరినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్, తమిళగ వాళ్ఉరిమై కట్చి, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి, మణిదనేయ మక్కల్ కట్చి ఎమ్మెల్యేలు తీర్మానానికి మద్దతుగా ప్రసంగించారు. నియోజకవర్గాల సంఖ్యను తగ్గించకూడదని అన్నాడీఎంకే ఎమ్మెల్యే దళవాయి సుందరం కోరారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున పలు వినతులతో కూడిన లేఖను స్పీకర్‌కు అందజేశారు. అనంతరం బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వ చర్యల ప్రధాన ఉద్దేశాన్ని గ్రహించి తీర్మానాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగం కొనసాగింపుకు స్పీకర్ నిరాకరించడంతో బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీంతో తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లయింది.

కమల్ పార్టీకి 'టార్చిలైట్' చిహ్నం



పెరంబూర్, ఫిబ్రవరి 14: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీకి టార్చిలైట్ చిహ్నాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించింది. నటుడు కమలహాసన్ నేతృత్వంలో ఎంఎన్ఎం 2019 పార్లమెంటు ఎన్నికలు, 2021 శాసనసభ ఎన్నికల్లో టార్చిలైట్ చిహ్నంపై పోటీ చేసింది. ఈ నేపథ్యంలో, పార్లమెంటు ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలలో ఎంఎన్ఎం పార్టీకి ఎన్నికల సంఘం, టార్చిలైట్ చిహ్నం కేటాయించాలంటూ కమల్ పార్టీ ఈసీకి విజ్ఞప్తి చేసింది. ఆ వినతిని ఈసీ పరిగణనలోకి తీసుకుంది.

మళ్లీ మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు మురుగన్

- నేడు నామినేషన్ దాఖలు



పెరంబూర్, ఫిబ్రవరి 14: మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యత్వం పొంది, ఆనక కేంద్ర ప్రసారశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎల్. మురుగన్... ఈ దఫా కూడా ఆ రాష్ట్రం నుంచే ఎగువ సభకు వెళ్లనున్నారు. ఇందుకోసం ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. గత తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన మురుగన్.. తారాపురం నియోజకవర్గంలో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అయితే ఆయన హయాంలో బీజేపీ నుంచి ఐదుగురు అభ్యర్థులు అసెంబ్లీ మెట్లెక్కడంతో ఆయన అధిష్ఠానం దృష్టిలో పడ్డారు. అనంతరం జరిగిన పరిణామాల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా గెలుపొంది, కేంద్రమంత్రి పదవిని స్వీకరించారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన పదవీకాలం ఏప్రిల్‌తో ముగియనున్న నేపథ్యంలో, మళ్లీ ఆయన అభ్యర్థిగా, మధ్యప్రదేశ్ నుంచి పోటీ చేస్తారని బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ విషయమై బుధవారం మురుగన్ ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో పని చేసేందుకు మరో అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. తాను రాజ్యసభ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి లేకపోవడం వల్లనే తాను పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేయడం లేదనే వార్తల్లో నిజం లేదన్నారు. పార్టీ ఎక్కడ సూచిస్తుందో అక్కడ పోటీచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అదే సమయంలో పార్టీ ఆదేశిస్తే రాష్ట్రం నుంచి తప్పక పోటీ చేస్తానని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో నీలగిరి నియోజకవర్గం నుంచి ఎ.రాజాకు వ్యతిరేకంగా పోటీ చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో, పార్టీ ఈ నిర్ణయం ఎలా తీసుకుందన్న విలేకరుల ప్రశ్నకు మురుగన్ స్పందిస్తూ... ఇది తన నిర్ణయం కాదని, తమ పార్టీ అధిష్ఠానం తీసుకున్నదని తెలిపారు. ఎ.రాజా, డీఎంకేను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని, ఆ పనులను రాష్ట్ర పార్టీ, అన్నామలై చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే తమిళనాడు నుంచి డీఎంకే కనిపించకుండా పోతుందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 40 స్థానాల్లో ఎన్డీఏ అభ్యర్థులు విజయం సాధించి, పార్లమెంటుకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు ఓపీఎస్ సీటు మార్పు



చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ బహిష్కరించిన మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం సీటును తన పక్కనుంచి మార్చాలంటూ అన్నాడీఎంకే అధినేత, శాసనసభ ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి చేసుకున్న వినతి పట్ల అసెంబ్లీ స్పీకర్ అప్పావు ఎట్టకేలకు స్పందించారు. ఓపీఎస్ సీటును ఈపీఎస్ వెనుక వరుసలోకి మారుస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఓపీఎస్ మద్దతుదారుడైన మనోజ్ పాండ్యన్ సీటును నాల్గో వరుసకు మార్చారు. గతంలో అన్నాడీఎంకే మాజీ స్పీకర్ ధనపాల్‌కు కేటాయించిన 207వ నెంబరు సీటును ఓపీఎస్‌కు కేటాయించారు. ఓపీఎస్ ఇప్పటి వరకూ కూర్చున్న సీటును అన్నాడీఎంకే ఉపనేత ఆర్‌పీ ఉదయకుమార్‌కు కేటాయించారు. 2021లో ఓపీఎస్‌ను తమ పార్టీ నుంచి బహిష్కరించిన అనంతరం శాసనసభలో ప్రతిపక్ష ఉపనేత హోదా నుంచి తప్పించాలని, ఆయన స్థానాన్ని కూడా తన పక్క నుంచి మార్చాలంటూ నాలుగుమార్లు లేఖలు రాసిన ఈపీఎస్... పలుమార్లు స్పీకర్‌ను నేరుగా కలుసుకుని విజ్ఞప్తి చేశారు. అయినా అటునుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం మళ్లీ శాసనసభలో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ సైతం జోక్యం చేసుకుంటూ ఈపీఎస్ వినతిని పరిగణనలోకి తీసుకోవాలని స్పీకర్‌కు విన్నవించిన విషయం తెలిసిందే.

పిల్లల పేర్లు తమిళంలో ఉంటే రూ.5,000 బహుమతి

- జిల్లాల సంఖ్య 60కి పెంపు
- పీఎంకే షాడో బడ్జెట్


షాడో బడ్జెట్ వెలువరిస్తున్న అన్బుమణి రాందాస్, నేతలు

ప్యారీస్, ఫిబ్రవరి 14: పాట్టాలి మక్కల్ కట్చి తరఫున 2024-25వ సంవత్సరానికి సంబంధించి జనరల్ షాడో బడ్జెట్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ బుధవారం చెన్నైలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆదాయం రూ.5,12,617 కోట్లుగా ఉంటుందని, ఇది గత సంవత్సరం కంటే రూ.1,94,144 కోట్లు అధికమన్నారు. ఖనిజ సంస్థలను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా పన్ను లేని ఆదాయంగా రూ.2,00,180 కోట్లు రాబట్టుకోవచ్చని తెలిపారు. వచ్చే పదేళ్లలో రాష్ట్రప్రభుత్వ ప్రస్తుత రుణభారాన్ని అదుపులోకి తీసుకురావచ్చన్నారు.

వాటిపై 30 శాతం పన్ను...

శీతలపానీయాలు, చక్కెర, పిజ్జా, బర్గర్, శాండ్‌విచ్, షవర్మా వంటి తీపి, ఉప్పు, కొవ్వు శాతం కలిగిన పదార్థాలపై 30 శాతం పన్ను విధించాలని, అంతేకాకుండా రాష్ట్రంలో వచ్చే జూలై 25న కులగణన చేపట్టాలని, యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి వంటి మత్తుపదార్థాలు పూర్తిస్థాయిలో అదుపుచేసేలా పోలీసు శాఖలో ప్రత్యేక విభాగం ప్రారంభం, మే 1వ తేది నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ మద్యనిషేధ చట్టాన్ని అమలు పరిచేలా తమ షాడో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. గృహిణుల సౌకర్యార్థం వంటగ్యాస్‌కు రూ.500 రాయితీ పంపిణీ చేస్తామని, పేద కుటుంబాలకు నెలా నెలా పంపిణీ చేస్తున్న రూ.1,000ని రూ.2,000కు పెంచడంతో పాటువృద్ధులు, అనాథలఆర్థికసాయం రూ.3,000పెంచుతామని తెలిపారు.

తమిళంలో పేర్లు పెడితే...

పిల్లలకు తమిళంలో పేరు పెట్టే తల్లిదండ్రులకు బహుమతిగా రూ.5,000 అందిస్తామని, అలాగే, దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో తమిళంలో పేరు పలకలు ఏర్పాటుచేస్తే రూ.1,000 ఇస్తామని తెలిపారు. తమిళ మీడియంలో చదువుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు ఇస్తామని, ఈ విద్యార్థులకు ఉన్నత విద్యలో 30 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తామన్నారు. చదువుకొని ఐదేళ్లకు పైగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు నెలకు రూ.5,000 వరకు ఉపకార వేతనం, రాజధాని నగరంలో రద్దీని పూర్తిస్థాయిలో తగ్గించేలా కోయంబేడు బస్ టెర్మినల్‌ను వేరే ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు.

బస్సు ఛార్జీలు పెంచబోం...

రాష్ట్రప్రభుత్వ బస్సుల్లో ఛార్జీలు పెంచబోమని అలాగే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 55 టోల్‌గేట్ల సంఖ్యను 17కు తగ్గిస్తామని, విద్యుత్ ఛార్జీలను నెలకోసారి మీటరు రీడింగ్ ఉంటుందన్నారు. ఆరోగ్యానికి సంబంధించిన అన్ని వివరాల స్మార్ట్ కార్డ్ పంపిణీ చేస్తామన్నారు. ఇక రాష్ట్ర అసెంబ్లీ కనీసం మూడేళ్లకు ఒకసారి, 100 రోజులకు ఒకసారి సమావేశమై ప్రజా సమస్యలపై చర్చించేందుకు, జిల్లాల సంఖ్యను 60గా పెంచే చర్యలు చేపడతామని, ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసుల పనిగంటలు 8గా నిర్ణయించేలా తమ పార్టీ తరఫున బడ్జెట్ నివేదికను రూపొందించామని అన్బుమణి తెలిపారు.

సబర్బన్ రైలులో విద్యార్థుల బాహాబాహీ

రాళ్లు, బీర్ బాటిళ్లతో పరస్పర దాడులు ● ముగ్గురి అరెస్ట్


పట్టరైవాక్కం రైల్వేస్టేషన్‌లో దాడులకు పాల్పడుతున్న విద్యార్థులు

అడయార్, ఫిబ్రవరి 14: స్థానిక పట్టరైపాక్కం రైల్వేస్టేషన్‌లో రెండు కళాశాలల విద్యార్థులు రాళ్లు, బీర్ బాటిళ్లతో పరస్పర దాడులకు పాల్పడడంతో ప్రయాణికులు భయాందోళనలు చెందారు. పచ్చయప్ప, రాజధాని కళాశాలల విద్యార్థుల మధ్య దీర్ఘకాలంగా ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. బస్సులు, సబర్బన్ రైళ్లలో విద్యార్థులు పరస్పర దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో పోలీసులు విద్యార్థులను అదుపులోకి తీసుకోవడం, వారిని హెచ్చరించడం తదితరాలు చేపట్టినా ఆ రెండు కళాశాలల విద్యార్థుల మధ్య తలెత్తుతున్న ఘర్షణలు అడ్డుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో.. తిరుత్తణి నుంచి బుధవారం ఉదయం చెన్నై సెంట్రల్‌కు సబర్బన్ రైలు బయల్దేరింది. ఉదయం వేళ కావడంతో రైలులో ప్రయాణికులు కిక్కిరిసిపోగా, పలువురు విద్యార్థులు ఫుట్‌బోర్డులపై నిలబడి ప్రయాణిస్తున్నారు. రైలు పట్టరైవాక్కం సమీపంలో వస్తుండగా రెండు బోగీల్లో ప్రయాణిస్తున్న పచ్చయప్ప, రాజధాని కళాశాలల విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రైలు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకోగానే విద్యార్థులు ఒక్కసారిగా రాళ్లు, బీర్, సోడా బాటిళ్లతో పరస్పర దాడులకు పాల్పడ్డారు. స్టేషన్‌లో ఒకరి వెంట ఒకరు తరుముతూ దాడులకు పాల్పడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పెరంబూర్ రైల్వే పోలీసులు అక్కడకు చేరుకొని ముగ్గురు విద్యార్థులను అదుపులోకి తీసుకొని, పరారైన మరో 10 మందిని గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు.

విద్యార్థులను డిస్మిస్ చేయండి

- రైల్వే పోలీసులు

దాడులకు పాల్పడిన విద్యార్థులను డిస్మిస్ చేయాలని రైల్వే పోలీసులు సంబంధిత కళాశాలల యజమాన్యాలకు లేఖ రాశారు. ఈ విషయమై రైల్వే డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. పచ్చయప్ప, రాజధాని కళాశాలల విద్యార్థుల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయన్నారు. బుధవారం కూడా విద్యార్థులు పరస్పర దాడులకు పాల్పడగా, ముగ్గురు విద్యార్థులను అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన విద్యార్థులను కళాశాలల నుండి డిస్మిస్ చేయాలని ఆయా కళాశాలల యజమాన్యాలకు లేఖ రాయడంతో పాటు బస్సు రైళ్లలో ప్రయాణించే విద్యార్థుల వివరాలు అందించాలని కోరినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు.


దక్షిణ చెన్నై పార్లమెంటు ఎంపీ నిధులతో చెన్నై తరమణిలో నిర్మించిన బస్టాండును బుధవారం ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, ఎమ్మెల్యే హసన్ మౌలానా, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ తదితరులు

సమాచార ధ్వని

25న మోటరు వాహన పరిశ్రమకు సీఎం శంకుస్థాపన

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: వియత్నాం దేశానికి చెందిన విన్‌ఫాస్ట్ సంస్థ తూత్తుకుడి జిల్లాలో విద్యుత్ వాహనాల తయారీ కర్మాగారం ఏర్పాటు చేయనుంది. సీఎం స్టాలిన్ 25వ తేది కర్మాగారం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వాణిజ్య శాఖ మంత్రి రాజా విడుదల చేసిన ప్రకటనలో... జనవరిలో జరిగిన ఒప్పందం మేరకు ఈ కర్మాగారం ఏర్పాటు చేస్తున్నారని, దక్షిణ జిల్లాల్లో వాణిజ్యాభివృద్ధి మెరుగుపడనుందని తెలిపారు.

జనన, మరణ ధృవీకరణాలకు ఆధార్ తప్పనిసరి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో జనన, మరణ ధృవీకరణ పత్రాల నమోదుకు ఆధార్ నెంబరు తప్పనిసరి అని ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం ఉత్తర్వులు జారీ చేశారు. జనన ధృవీకరణ పత్రాలు కోరే సమయంలో తల్లి, తండ్రి ఆధార్ నెంబరు, మరణ ధృవీకరణ పత్రానికి మరణించిన వ్యక్తి ఆధార్ నెంబరు అప్‌లోడ్ చేయాలని, మున్సిపాలిటీలు, పంచాయతీలు ఆదేశాలు జారీ చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

21నుంచి చతుర్వేద పారాయణం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: ఆదంబాక్కం తిరువేంగాడు సుబ్రమణ్యా ఘనపాడిగళ్ వేదపారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో 86వ వార్షిక చతుర్వేద పారాయణం, మహారుద్రయాగాలు ఈనెల 21వ తేది నుంచి మార్చి 3వ తేది వరకు కుంభకోణం శంకర మఠం, ఉత్తరాది మఠంలో జరగనున్నాయి. ఈనెల 24వ తేది మధ్యాహ్నం ఉప్పిలియప్పన్ ఆలయం, పరనూరు కృష్ణప్రేమ స్వామి, మురళీధర స్వామి అధ్యక్షతన వేదపారాయణం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు జరగనుంది. 29వ తేది వేదపరిషై, మార్చి 1న సుదర్శన హోమం, 2న చక్రపాణి ఆలయంలో రాధాకల్యాణం జరగనున్నాయి. 3వ తేది తిరువిసైనల్లూర్ రామకృష్ణ భాగవతర్ ఆధ్వర్యంలో మహారుద్ర హోమం, వసోర్ధార హోమం, దంపతి పూజ జరగనున్నాయి.

తపాలా బీమా ఏజెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: తపాలా బీమా ఏజెంట్ల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జనరల్ పోస్టాఫీసు ప్రధానాధికారి స్వాతి మధురిమ తెలిపారు. తపాలా శాఖలో జీవిత బీమా పథకాలను ప్రజలకు తెలియజేసి సభ్యులుగా చేర్చేందుకు ఏజెంట్ల నియామకాలు చేపట్టనున్నామని తెలిపారు. దరఖాస్తుదారులు 18 ఏళ్ల పూర్తయి, టెన్త్ పాసై ఉండాలని తెలిపారు. వారి ఖాతాలో రూ.5 వేలు డిపాజిట్ ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు 9042342391, 044-25212549 అనే నెంబర్లు సంప్రదించాలని తెలిపారు.

స్కాట్ శిక్షణ పొందిన వారికి రైల్వేలో ఉద్యోగావకాశాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: స్కాట్ శిక్షణ పొందిన వారు క్లర్క్ కం టైపిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని రైల్వే శాఖ తెలిపింది. దరఖాస్తుదారులకు 18 నుంచి 33 ఏళ్ల వయోపరిమితి కల్పించగా, ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు సడలింపునిచ్చారు. టెన్త్, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు స్కాట్ శిక్షణ పొందిన వారు రూ.500 (ఓడీసీలు), రూ.250 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలు, హిజ్రాలు) ఆన్‌లైన్‌లో చెల్లించి ఈ నెల 20వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు www.rrcmas.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

రేపు చెన్నై హార్బర్‌కు యుద్ధనౌక

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: నావికాదళం ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌక రెండు రోజుల పర్యటనగా శుక్ర, శనివారాల్లో చెన్నై హార్బర్‌కు రానుంది. సముద్రపు దొంగలను అడ్డుకొనేందుకు అరేబియా సముద్రంలో ఈ నౌకలో గస్తీ పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, విశాఖపట్టణంలో 50కి పైగా దేశాలు పాల్గొనే 'మిలన్ 2024' అనే సంయుక్త నావికాదళ శిక్షణ కార్యక్రమంలో ఈ యుద్ధ నౌక పాల్గొననుంది. ఈలోపు రెండు రోజుల పర్యటనగా చెన్నైలో మకాం వేయడం గమనార్హం.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: స్థానిక తరమణిలో ఈనెల 15న గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరగనుంది. ఐటీ కారిడార్ పరిధిలోని టైడల్ పార్కు ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు జరిగే గ్రీవెన్స్‌లో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు తెలిపింది.

సురక్షిత ప్రయాణంపై విద్యార్థులకు అవగాహన

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: సురక్షిత ప్రయాణంపై సబర్బన్ రైళ్లలో ప్రయాణించే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు రైల్వే భద్రత దళం అధికారులు తెలిపారు. ఈ విషయమై స్థానిక మాంబళం రైల్వే భద్రత ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ... కొందరు విద్యార్థులు నిబంధనలు ఉల్లంఘించి ఫుట్ బోర్డ్ ప్రయాణం, కిటికీ ఊచలను పట్టుకుని ప్రయాణిస్తున్నారని, వీటిపై అవగాహన కల్పించే చర్యలు చేపట్టామన్నారు. నుంగంబాక్కం, ఆలందూర్, మాంబళం ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

బీజేపీ వైపు కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయధరణి చూపు?



అడయార్, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ మహిళా ఎమ్మెల్యే విజయధరణి బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలను నిజం చేసేలా గత రెండు రోజులుగా శాసనసభ సమావేశాలకు కూడా ఆమె హాజరుకావడం లేదు. దీంతో ఆమె పార్టీ మారడం ఖాయమనే ప్రచారం సాగుతుంది. గత 2011, 2016, 2021లో జరిగిన ఎన్నికల్లో ఆమె మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం ఆమె కన్నియాకుమారి జిల్లా విలవంగోడు అసెంబ్లీ స్థానం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీజేపీ హవా కొనసాగుతుండటంతో ఆమె కూడా కాషాయం కండువా కప్పుకునేందుకు హస్తినలో మకాం వేసివున్నట్టు సమాచారం. ఇదే విషయంపై ఆమెను కొన్ని మీడియా సంస్థలు సంప్రదించగా, ఒక కేసు విచారణ కోసం ఢిల్లీకి వచ్చినట్టు సమాధాన మిచ్చారు. అదేవిధంగా బీజేపీలో చేరబోతున్నట్టు సాగుతున్న ప్రచారాన్ని కూడా ఆమె తోసిపుచ్చలేదు. దీంతో ఆమె బీజేపీలో చేరడం ఖాయమని వార్తలు వస్తున్నాయి.

మాస్ క్లీనింగ్ పనుల పరిశీలన

వేలూరు, ఫిబ్రవరి 14: జిల్లావ్యాప్తంగా కార్పొరేషన్, మున్సిపాలిటీలు, యూనియన్ పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో మాస్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని 4వ మండలం కొనవట్టంలో చేపట్టిన పారిశుధ్య పనులను కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. అనంతరం పళ్లికొండ పంచాయతీలోని రీ సైక్లింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. అక్కడ నుంచి గుడియాత్తం ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన కలెక్టర్... ఔట్, ఇన్ పేషంట్ల విభాగాలు, ప్రసవ గది, ఆపరేషన్ థియేటర్ పరిశీలించారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనంద కుమార్, పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, గుడియాత్తం నగర మండ్ర అధ్యక్షుడు సౌందర్‌రాజన్, మండల కమిటీ అధ్యక్షుడు వెంకటేశన్, వేలూరు యూనియన్ కమిటీ అధ్యక్షులు అముద జ్ఞానశేఖరన్, ఉప కమిషనర్ శశికళ, గుడియాత్తం రెవెన్యూ తహసీల్దార్ సుబ్బులక్ష్మి, గుడియాత్తం మున్సిపాలిటీ కమిషనర్ మంగైకరసన్, నిర్వాహక అధికారి ఉమారాణి తదితరులు ఉన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

సీఎం జోక్యంతో జాక్టో-జియో సమ్మె వాపస్



సీఎంకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందిస్తున్న నేతలు

పెరంబూర్, ఫిబ్రవరి 14: జాక్టో జియో సంఘం ఈనెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న సమ్మె తాత్కాలికంగా విరమించుకుంది. పాత పింఛన్ విధానం అమలు సహా పలు డిమాండ్లతో సమ్మె చేపట్టనున్నట్లు సంఘం ప్రకటించింది. ఈ విషయమై మంగళవారం సంఘ నేతలతో మంత్రి ఏవీ వేలు చర్చలు విఫలమవడంతో సమ్మె కొనసాగించనున్నట్లు తెలిపారు. శుక్రవారం సమ్మె సన్నాహక నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్ల సంఘ నేతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సీఎం స్టాలిన్ బుధవారం జాక్టో-జియో ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు. ఆ సంఘ ప్రతినిధులు సీఎంను కలుసుకొని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడ తానని సీఎం హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ఉపసంహరించుకుంటున్నట్లు జాక్టో-జియో ప్రతినిధులు తెలిపారు.

సాయుధ పోలీసుల భద్రతలో కోవై



పెరంబూర్, ఫిబ్రవరి 14: కోయంబత్తూర్‌లో బాంబు పేలుడు ఘటన జరిగి 26 ఏళ్ల పూర్తయిన తరుణంలో, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాయుధ పోలీసులు భద్రతా విధులు చేపట్టారు. కోవైలో 1988 ఫిబ్రవరి 14న వరుస బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ ఘటన జరిగి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా విధులు చేపట్టారు. కోవై నగర పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ నేతృత్వంలో సుమారు 1,800 మంది పోలీసులు రద్దీ ప్రాంతాలు, బస్టాండు, రైల్వేస్టేషన్లు, ప్రార్థనా స్థలాల వద్ద బందోబస్తు చేపట్టారు. అలాగే, 8 బాంబ్ స్క్వాడ్‌లు కూడా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి.

నేపియర్ ముఖద్వారంలో పూడికతీత



మెరీనా నేపియర్ వంతెన ప్రాంతంలో తాత్కాలిక బాట

ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: స్థానిక మెరీనా నేపియర్ ముఖద్వారంలో అలల కోత అడ్డుకొనేలా ముక్కోణపు రాళ్ల అమరిక, పూడికతీత పనులు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీవర్షాలకు సముద్రతీరం దగ్గరగా ఉన్న ట్రిప్లికేన్, రాయపేట, మైలాపూర్ ప్రాంతాల్లో ఉధృతంగా నీరు పారింది. ఇప్పటివరకు తుఫాను కారణంగా ఈ ప్రాంతాలు నీటమునగలేదు. పూడికతీత చేపట్టకపోవడం వల్లే వర్షపు నీరు సముద్రంలోకి వెళ్లక నీరు పారినట్టు చెబుతున్నారు. దీంతో, ముఖద్వారంలో పూడికతీత చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పనులతో పాటు సముద్రపు కోతను అడ్డుకొనేలా నక్షత్రపు ఆకారం కలిగిన భారీ సిమెంటు దిమ్మెలతో అడ్డుకంచె ఏర్పాటు చేస్తున్నారు.

కోడంబాక్కంలో దివ్యాంగుల రాస్తారోకో



పెరంబూర్, ఫిబ్రవరి 14: ఒక శాతం రిజర్వేషన్ కేటాయించాలంటూ దివ్యాంగులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. కోడంబాక్కంలో ర్యాలీ చేపట్టిన దివ్యాంగులు పై ఓవర్ ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించారు. ఈ కారణంగా ఆ మార్గంలో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని ఆందోళనకారులను అరెస్ట్ చేసి సమీపంలోని కల్యాణ మండపానికి తరలించారు.

ప్రేమ జంటల సందడి

ప్యారీస్, ఫిబ్రవరి 14: వాలంటైన్స్ డేను పురస్కరించుకొని మెరీనా తీరంతో పాటు ప్రధాన పార్కులు, మాల్స్, థియేటర్లు, పర్యాటక ప్రాంతాలైన మహాబలిపురం, ఏర్కాడు, ఊటీ, కొడైక్కెనాల్, కన్నియాకుమారి ప్రాంతాల్లో ప్రేమికుల సందడి నెలకొంది. మెరీనా బీచ్‌లో ఇసుకలో కూర్చొని సేదతీరిన ప్రేమజంటలు కేక్ కట్ చేసి, ప్రేమికుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ముందుగానే కేక్‌లు ఆర్డరు చేసిన జంటలకు స్విగ్గీ, జొమాటో సిబ్బంది ద్వారా బేకరీలు అందజేశాయి. గతంలో ప్రేమజంటలను వ్యతిరేకిస్తూ పలు హిందూ సంస్థలు వారిని నిర్బంధించి వివాహాలు చేసిన సందర్భాలున్నాయి. అయితే ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లో పోలీసు శాఖ భద్రత కట్టుదిట్టం చేసింది. ఇదిలా ఉండగా, వడమదురై సమీపంలోని నల్లమనార్ కోటకు చెందిన సురేష్, సరస్వతి జంట పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి వివాహం చేసుకుంది. కాగా ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఒక రోజా రూ.20కు విక్రయించారు. కాగా, ఓ ప్రైవేటు ఆన్‌లైన్ డెలివరీ సంస్థలో కేవలం ఒకే నిమిషంలో 251 రోజా పూలు ఆర్డరు రాగా వాటిని డెలివరీ చేసినట్టు సదరు స్థలు తెలిపారు. ఇక నగరంలోని కొన్ని దుకాణాల్లో క్షణాల్లో రోజాలు విక్రయించినట్లు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశీలించకుండా అనుమతులివ్వలేం

● స్టెరిలైట్ కర్మాగారంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

పెరంబూర్, ఫిబ్రవరి 14: భద్రత విషయం పరిశీలించకుండా హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేయలేమని స్టెరిలైట్ కర్మాగారం కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తూత్తుకుడిలో వేదాంత సంస్థకు సొంతమైన స్టెరిలైట్ కర్మాగారం 22 ఏళ్లుగా పనిచేస్తోంది. కర్మాగారం ఉన్న ప్రాంతంలో పర్యావరణానికి హాని కలుగుతోందంటూ పలు స్వచ్ఛంద సంస్థలు ఆందోళనలు చేపట్టాయి. 2018 మే 22న కర్మాగారానికి వ్యతిరేకంగా చేపట్టిన ప్రదర్శనకారులపై పోలీసులు కాల్పులు జరపడంతో 13 మంది మృతిచెందారు. దీంతో కర్మాగారాన్ని మూసివేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, కర్మాగారంపై నిషేధం ఎత్తివేయాలని కోరుతూ వేదాంత సంస్థ, ఆ ప్రాంత వాసులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలుచేశారు. ఈ పిటిషన్లు బుధవారం విచారణకు వచ్చాయి. న్యాయస్థానం ఉత్తర్వులను స్టెరిలైట్ నిర్వాహకులు ఉల్లంఘించినట్లుయి ప్రభుత్వం వాదించింది. అనంతరం న్యాయమూర్తులు స్పందిస్తూ... కర్మాగారం మూసివేసి ఆరేళ్లు అవుతోందని, ప్రభుత్వం, స్టెరిలైట్ యజమాన్యం అంగీకరిస్తే నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేసి పరిశీలించవచ్చని సూచించింది. ఆ తరువాతే కర్మాగారం ప్రారంభంపై నిర్ణయం తీసుకుంటామని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది.

వైభవంగా వళ్లిమలై ఆలయ బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

వేలూరు, ఫిబ్రవరి 14: కాట్పాడి తాలూకా వళ్లిమలైలో ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ధ్వజారోహణం వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం జరిగింది. ముందుగా ధ్వజారోహణ పతాకం, వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణలో మాడవీధుల్లో ఊరేగించారు. ఏర్పాట్లను ఈవో తిరునావుక్కరసు, మేనేజర్ రాజ్‌కుమార్ పర్యవేక్షించగా, వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సొమ్ము అందజేత



బాధితులకు నగదు అందజేస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు, ఫిబ్రవరి 14: స్థానిక సాయినాథపురానికి చెందిన కంప్యూటర్ ఇంజనీర్ కొద్దిరోజుల క్రితం తన సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేసిన సమయంలో, తన బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు. అలాగే, గుడియాత్తం ఏరితాంగళ్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ ఖాతా నుంచి ఇదే విధంగా రూ.20 వేలు బదిలీ అయ్యాయి. బాధితుల ఫిర్యాదుమేరకు చర్యలు చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు నగదును రికవరీ చేశారు. ఆ నగదును బుధవారం బాధితులకు ఎస్పీ మణివన్నన్ అందజేశారు.

తోటపాళ్యంలో వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వేలూరు, ఫిబ్రవరి 14: పుదియ నీతి కట్చి వ్యవస్థాపకుడు ఏసీ షణ్ముగం ఆధ్వర్యంలో వేలూరు పార్లమెంటు నియోజకవర్గంలో వైద్య ఉచిత శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, తోటపాళ్యం కేటీ నర్సరీ అండ్ ప్రైమరీ పాఠశాలలో బుధవారం శిబిరం జరిగింది. డాక్టర్ ఎంజీఆర్ యూనివర్సిటీ వైద్యబృందం పాల్గొని 1,200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి మధ్యాహ్న భోజనం అందజేశారు.

ఉదయనిధిని ఎంజీఆర్‌లా భావిస్తున్నారు

● ఆర్ఎస్ భారతి

పెరంబూర్, ఫిబ్రవరి 14: 'ఎంజీఆర్ కారులో వస్తున్న సమయంలో వీధుల పక్కన నిల్చుని చూస్తున్న విధంగా, మంత్రి ఉదయనిధిని ప్రజలు చూస్తున్నారని డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి తెలిపారు. పుదుకోట నగర డీఎంకే ఆధ్వర్యంలో మంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా తిలగర్ మైదానంలో మంగళవారం రాత్రి బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ఆర్ఎస్ భారతి మాట్లాడుతూ.. గత 2019 పార్లమెంటు ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయనిధి రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపట్టారని, డీఎంకే భారీ విజయానికి ఆయన ప్రచారం తోడ్పడిందన్నారు. ఉదయనిధి రాజకీయాల్లోకి వచ్చిన అనంతరం, విజయ్ సహా పలు సినీరంగానికి చెందిన వారు రాజకీయాల్లోకి రావడం అధికమైందన్నారు. అదే సమయంలో ఎర్రకోట ఎక్కే వారందరూ దేశింగు రాజా కాలేరని ఆర్ఎస్ భారతి చమత్కరించారు.

రెండు కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లు

పెరంబూర్, ఫిబ్రవరి 14: నాగర్‌కోయిల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నిషాంత్‌కృష్ణన్, తిరుచ్చి కార్పొరేషన్ కమిషనర్‌గా వి.శరవణన్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) అదనపు కమిషనర్ (ఆరోగ్యశాఖ)గా వి.జయచంద్రభాను నిమితులయ్యారు.

నార్త్ చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో త్వరలో ఉత్పత్తి: టీఎన్ఈబీ

ప్యారీస్, ఫిబ్రవరి 14: తిరువళ్లూర్ జిల్లాలోని నార్త్ చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో చేపట్టిన మూడో విడత విస్తరణ పనులు ముగింపు దశలో ఉన్నాయని, త్వరలోనే ఈ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తమిళనాడు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. కాట్టుపల్లి సమీపంలో ఉన్న ఈ థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.15,702 కోట్లతో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడో విద్యుత్ పథకం పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ట్రయల్ రన్ నిర్వహించి విద్యుదుత్పత్తి ప్రారంభించే చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

పోయెస్ గార్డెన్ నిర్వహణ చారిటబుల్ ట్రస్ట్ చట్టం రద్దు

అడయార్, ఫిబ్రవరి 14: మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత నివాసమైన పోయెస్ గార్డెన్‌లోని ఇంటి నిర్వహణ కోసం ఒక చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం తెచ్చిన చట్టానికి కాలపరిమితి తీరిపోయింది. దీంతో ఈ చట్టాన్ని రద్దు చేస్తూ ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టింది. ఇందులో.. మాజీ ముఖ్యమంత్రి జయలలిత నివాసమైన పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయాన్ని స్మారక భవనంగా మార్చి, దాని నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తూ చట్టాన్ని తీసుకొచ్చింది. 2021లో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసి, ఆ నివాసాన్ని జయలలిత వారసులకు అప్పగించాలని ఆదేశించింది. దీంతో జయ ఇంటి తాళాలను ఆమె అన్న పిల్లలు దీప, దీపక్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో 2021లో రూపొందించిన చట్టం కార్యరూపం దాల్చకపోవడంతో దాని కాలపరిమితి తీరిపోవడంతో ఈ చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ముసాయిదా బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించింది.

మంత్రి పదవిలో లేడు... బెయిలివ్వండి

● సెంథిల్ బాలాజి తరఫు న్యాయవాది వాదన

పెరంబూర్, ఫిబ్రవరి 14: మంత్రి పదవిలో లేని సెంథిల్ బాలాజికి బెయిలు మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది అరియమా సుందర్ న్యాయస్థానాన్ని కోరారు. చట్టవ్యతిరేక నగదు పరివర్తన చట్టం కింద గత ఏడాది జూన్ 14న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేసిన మంత్రి పుళల్ జైలులో ఉన్నారు. అనారోగ్యం దృష్ట్యా బెయిలు మంజూరు చేయాలని చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు మద్రాసు హైకోర్టు, సుప్రీంకోర్టులో దాఖలుచేసిన పిటిషన్లు తిరస్కరణకు గురయ్యారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో, సెంథిల్ బాలాజి మంత్రి పదవిలో ఉన్నాడని, ఆయనకు బెయిలు మంజూరు చేస్తే సాక్ష్యాలు తారుమారు చేస్తారని, అందువల్ల బెయిలివ్వరాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ తరఫున తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రెండు రోజులు క్రితం సెంథిల్ బాలాజి తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీఎంకు లేఖ పంపారు. సీఎం సిఫారసులతో ఆయన రాజీనామా ఆమోదిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజీ తాజాగా దాఖలుచేసిన బెయిలు పిటిషన్ బుధవారం విచారణకు రాగా, పిటిషన్‌దారుడి తరఫున హాజరైన న్యాయవాది, ప్రస్తుతం సెంథిల్ బాలాజి మంత్రి పదవిలో లేరని, అందువల్ల ఈడీ ఆరోపిస్తున్నట్లు సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం లేదని పేర్కొన్నారు. అలాగే, ఈడీ అధికారులు సాక్ష్యాలు తారుమారు చేయడంతో పాటు స్వాధీనం చేసుకున్న దస్తావేజులు కూడా మాయం చేస్తున్నారని వాదించారు. అనంతరం ఈ విషయమై నివేదిక దాఖలు చేయాలని ఈడీకి నోటీసు జారీచేసిన న్యాయస్థానం, తదుపరి విచారణ గురువారానికి వాయిదావేసింది.

● సభా పర్వం

టి.నగర్ సెగ్మెంట్‌లో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నిర్మించాలి

అడయార్, ఫిబ్రవరి 14: తన నియోజకవర్గమైన టి.నగర్‌లో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే జె.కరుణానిధి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా, బుధవారం జరిగిన సభా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ... వడపళని అళగిరి నగర్ 5వ వీధిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పక్కా భవనం నిర్మించి ఇవ్వాలన్నారు. టి.నగర్ నియోజకవర్గ పరిధిలోని వడపళని, వెస్ట్ మాంబళం, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కేకే నగర్ ప్రాంతంలో ఉండేదని, ఇపుడు ఈ కార్యాలయాన్ని ముగప్పేరుకు మార్చారని ఈ కారణంగా తన నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై మంత్రి మూర్తి సమాధానమిస్తూ... స్థలాభావం కారణంగానే కార్యాలయాన్ని మరో ప్రాంతానికి మార్చామన్నారు. టి.నగర్‌లో స్థలం చూపించినట్టయితే, పక్కా భవనం నిర్మిస్తామని బదులిచ్చారు.

117 పట్టణాల్లో ఔటర్ రింగ్ రోడ్లు

● మంత్రి ఏవీ వేలు

ప్యారీస్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని 117 పట్టణాల్లో ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ప్రజా పనుల శాఖా మంత్రి ఏవీ వేలు తెలిపారు. అసెంబ్లీలో బుధవారం రహదారుల నిర్మాణంపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానిమస్తూ... గత రెండేళ్లలో పట్టణ ప్రాంతాల్లో ఔటర్ రింగ్ రోడ్లు నిర్మించాలని సూచించారని ఆ మేరకు రోడ్ల నిర్మాణం పనులను తొలి విడతగా 50 పట్టణాల్లో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. మరో 35 ప్రాంతాల్లో స్థల సేకరణ పనులు పూర్తయ్యాయని, గంధర్వకోట నియోజకవర్గంలో ప్రజల సంఖ్య అధికంగా ఉండటంతో త్వరలోనే ఈ ప్రాంతంలో ఓఆర్ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు మంత్రి వివరించారు.

జూన్‌లో కూత్తాండవర్ కుంభాభిషేకం

● మంత్రి పీకే శేఖర్ బాబు వెల్లడి

ప్యారీస్, ఫిబ్రవరి 14: కడలూరు జిల్లా పరంగిపేటలో ఉన్న పురాతన కూత్తాండవర్ ఆలయంలో వచ్చే జూన్‌లో కుంభాభిషేకం నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖమంత్రి పీకే శేఖర్‌బాబు వెల్లడించారు. అసెంబ్లీలో బుధవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కడలూరు జిల్లా చిదంబరం నియోజకవర్గ ఎమ్మెల్యే పాండ్యన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ... కూత్తాండవర్ ఆలయ కుంభాభిషేకం నిర్వహించే నిమిత్తం రూ.18 లక్షలతో జీర్ణోద్ధారణ పనులు చేపట్టామని, జూన్ నాటికి ఈ పనులన్నీ పూర్తవుతాయని తెలిపారు. రెండున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 1378 ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించినట్టు మంత్రి శేఖర్ బాబు తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి

● మంత్రి అన్బరసన్ ఆదేశం

ప్యారీస్, ఫిబ్రవరి 14: సహకార సంఘాలకు చెందిన భూముల్లో ఆక్రమణలు ఉన్నట్టయితే వెంటనే తొలగించాలని చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి టీఎం అన్బరసన్ అధికారులను ఆదేశించారు. గిండీలో ఉన్న చిన్న పరిశ్రమల కమిషనర్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం మంత్రి అన్బరసన్ సమీక్షా సమావేశం న్విహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 2023-24వ ఆర్థిక సంవత్సరంలో సుమారు 7444 మంది లబ్ధిదారులకు రూ.275.88 కోట్ల సబ్సిడీగా అందజేశామన్నారు. అలాగే, మిచౌంగ్ తుపాను, వరదల కారణంగా నష్టపోయిన 819 చిన్న మధ్యతరహా పరిశ్రమల యజమానులకు రూ.21.67 కోట్ల రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ శాఖ అడిషనల్ కమిషనర్ గ్రేస్ బచావ్, అడిషినల్ డైరెక్టర్ మరుదప్పన్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఐదో తరగతి విద్యార్థి మృతి





బోల్తాపడిన ఆటో - మృతుడు ప్రదీష్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఫిబ్రవరి 14: అంబాసముద్రం సమీపం అగస్తియర్‌పట్టిలో పాఠశాల విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో 5వ తరగతి విద్యార్థి మృతి చెందాడు. తిరునల్వేలి జిల్లా అంబాసముద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు డ్రైవర్ సుందరం తన ఆటోలో విద్యార్థులను తీసుకొస్తుంటాడు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం విద్యార్థులతో వస్తున్న ఆటో అగస్తియర్ పట్టి ప్రాంతంలో రోడ్డు పక్కగా బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటో కింద చిక్కుకున్న విక్కిరమసింగపురం తంగమ్మన్ ఆలయ వీధికి చెందిన చిత్తిరైనాథన్ కుమారుడు ప్రదీష్ (10) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అలాగే, ఆటోలో ప్రయాణిస్తున్న శివదర్శిని, సూర్య సహా ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకి చేరుకొని గాయపడిన విద్యార్థులను అంబాసముద్రం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి డ్రైవర్ సుందరాన్ని అరెస్టు చేశారు.

రూ.15 లక్షల విలువైన మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కార్లు, మద్యం బాటిళ్లు

పెరంబూర్, ఫిబ్రవరి 14: పుదుచ్చేరి నుంచి మహాబలిపురానికి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్టు విల్లుపురం జిల్లా ఇంటెలిజన్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ చిన్నకోమన్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం రాత్రి పట్టానూరు నావర్‌కుళం జంక్షన్‌లో వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన రెండు కార్లను అడ్డుకొని పరిశీలించగా, రూ.15 లక్షల విలువైన మద్యం బాటిళ్ల గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పుదుచ్చేరికి చెందిన డ్రైవర్ బాలమురుగన్ తన స్నేహితులతో కలసి పుదుచ్చేరి నుంచి ఉన్నత రకం మద్యం కొనుగోలు చేసి మహాబలిపురంలోని లగ్జరీ హోటళ్లకు సరఫరా చేసేందుకు తీసుకెళ్తున్నట్టు తేలింది. పోలీసులు మద్యం బాటిళ్ల, రెండు కార్లను స్వాధీనం చేసుకొని విచారిస్తున్నారు.

షూలో తరలిస్తున్న రూ.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం

పెరంబూర్, ఫిబ్రవరి 14: తిరుచ్చి విమానాశ్రయంలో షూలో దాచి తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్ నుంచి మంగళవారం అర్ధరాత్రి తిరుచ్చికి వచ్చిన విమాన ప్రయాణికులను అధికారులు తనిఖీ చేశారు. ఈ సమయంలో ఓ ప్రయాణికుడు ధరించిన షూ అడుగు భాగంలో లోహం ఉన్నట్లు స్కాన్ పరికరం ద్వారా అధికారులు గుర్తించారు. అనంతరం ఆ షూలు పరిశీలించగా, లోపలిభాగాన పేస్ట్ రూపంలో ఉంచిన 797.400 గ్రాములు బంగారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్లో బంగారం విలువ రూ.50 లక్షలుంటుందని తెలిపిన అధికారులు, ఆ వ్యక్తిని విచారిస్తున్నారు.

అత్యవసర డోర్ తెరిచేందుకు యత్నం

భత్రతా సిబ్బంది అదుపులో విమాన ప్రయాణికుడు

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి ఢిల్లీకి బయలుదేరిన విమానం అత్యవసర ద్వారాన్ని తెరిచేందుకు ఒక ప్రయాణికుడు ప్రయత్నించడంతో కలకలం రేగింది. దీంతో ఆ ప్రయాణికుడిని విమాన సిబ్బంది అదుపులోకి తీసుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. మంగళవారం రాత్రి చెన్నై నుంచి ఢిల్లీకి 159 మంది ప్రయాణికులు, విమాన సిబ్బందితో కలిసి ఇండిగో విమానం బయలుదేరింది. ఈ విమానం రన్‌వేపై వేగంగా దూసుకెళ్తుండగా, అత్యవసర ద్వారం తెరుస్తున్నట్టుగా డేంజర్ బెల్ మోగింది. ఈ కారణంగా విమానం నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అక్కడ కూర్చున్న ప్రయాణికుడిని విచారించగా, తాను ఉద్దేశపూర్వకంగా తలుపు తెరవలేదని, పొరపాటున చేయి తగిలిందని చెప్పాడు. అయితే అతని మాటల్ని పట్టించుకోని విమాన సిబ్బంది.. అదుపులోకి తీసుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఈ ఘటన కారణంగా ఆ విమానం గంట ఆలస్యంగా బయలుదేరి వెళ్లింది.

చిత్రజ్యోతి


'బర్త్‌మార్క్'లో షబీర్ - మిర్నా

మిస్టరీ డ్రామా 'బర్త్‌మార్క్'

● 23న విడుదల

'సర్పాట్ట పరంబరై' చిత్రం తర్వాత డాన్సింగ్ రోజ్‌గా గుర్తింపు పొందిన షబీర్ కల్లరక్కల్ హీరోగా నటించిన చిత్రం 'బర్త్ మార్క్'. మిర్నా హీరోయిన్. మిస్టరీ డ్రామాగా తెరకెక్కించారు. విక్రమ్ శ్రీధరన్ దర్శకత్వం వహించారు. ఇందులో దీప్తి, ఇంద్రజిత్, పొర్కొడి, పీఆర్ వరలక్ష్మి ఇతర పాత్రలను పోషించారు. ఉదయ్ తంగవేల్ సినిమాటోగ్రఫీ అందించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూర్చారు. ఈనెల 23న విడుదలకు సిద్ధమైన ఈ చిత్రాన్ని సపియన్స్ ఎంటర్‌టైన్మెంట్, ఏపీ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ చిత్రం గురించి దర్శకుడు విక్రమ్ శ్రీధరన్ చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ... '1990వ దశకంలో కార్గిల్ యుద్ధకాలంలో జరిగిన ఈ చిత్రం జనన ప్రక్రియ, మనిషి ఆత్మ ఎలా శుద్ధి అవుతుంది, ఎలా జ్ఞానోదయం పొందుతుందనే అంశాలను టచ్ చేస్తూ స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఇందులో షబీర్ లెఫ్టినెంట్ పాత్రలో నటించగా, గర్భిణి అయిన తన భార్యకు ప్రసవం సహజ ప్రక్రియ ద్వారా జరిగేలా చేయాలని నిర్ణయిస్తారు. ఇందుకోసం పురాతన ఆచార వ్యవహారాలను అనుసరించే గ్రామానికి వెళతాడు. ఈ గ్రామంలోకి అడుగుపెట్టగానే చిన్ననాటి గాయం, యుద్ధంతో పాటు,గ్రామంలోని అనుభవాలు అతనిలో అనేక ప్రశ్నలు ఉద్భవిస్తాయి. అలాగే, నిండు గర్భిణి అయిన, ఆయన భార్య అసమానతలకు ఎదురొడ్డి ఎలా బిడ్డకు జన్మనిస్తుందన్నదే ఈ సినిమా ప్రధాన సారాంశం. ఇందులో మిర్నా గర్భిణిగా నటించగా, మద్రై యూర్ అనే మారుమూల గ్రామంలో చిత్రీకరణ పూర్తి చేశాం' అని వివరించారు.

శివకార్తికేయన్ సరసన రుక్మిణి వసంత్!



కన్నడం, తెలుగు చిత్రసీమల్లో మంచి పేరుతో పాటు గుర్తింపు సొంతం చేసుకున్న హీరోయిన్ రుక్మిణి వసంత్ ఇపుడు కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలే 'అయలాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న శివకార్తికేయన్ సరసన ఆమె నటించేందుకు ఎంపికయ్యారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని తిరుపతి ప్రసాద్ నిర్మిస్తుండగా, షూటింగ్ కూడా ప్రారంభమైంది. వాస్తవానికి ఈ సినిమాలో హీరోయిన్‌గా పూజా హెగ్డే, మృణాల్ ఠాగూర్‌ను ఎంపిక చేసేందుకు సంప్రదింపులు జరిపినప్పటికీ చివరకు రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేశారు. కాగా, రుక్మిణి వసంత్ ఇప్పటికే ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి నటించే 51వ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా విడుదలకాకముందే ఆమె మరో మూవీకి ఎంపిక కావడం కోలీవుడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

షేన్ నిగమ్ - నిహారిక జంటగా


'మద్రాస్ కారన్'


కలైయరసన్, ఐశ్వర్య, నిహారిక, షేన్ నిగమ్

షేన్ నిగమ్ - నిహారిక కొణిదెల, ఐశ్వర్య దత్తా, కలైయరసన్‌తో 'మద్రాస్ కారన్' పేరుతో ఒక చిత్రం తెరకెక్కనుంది. యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకునే ఈ చిత్రానికి వాణి మోహన్‌దాస్ దర్శకత్వం. శ్యామ్ సీఎస్ సంగీతం. ఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానరుపై నిర్మించే ఈ చిత్రం ప్రారంభ పూజా కార్యక్రమం తాజాగా చెన్నైలో జరిగింది. ఇందులో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. నటి ఐశ్వర్య దత్తా మాట్లాడతూ... 'దర్శకుడు వాలితో కలిసి ఒక చిత్రం చేశా. ఆయన నా ఫేవరేట్ డైరెక్టర్. 2024లో ఈ చిత్రంలో నటించేందుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్ మాట్లాడుతూ... 'మంచి కథ. ఇందులో ప్రతి ఒక్కరికీ మంచి పాత్రలు ఉంటాయి. ఎమోషన్స్ ఎక్కువ. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒక్కో అప్‌డేట్ వచ్చేకొద్దీ ఈ స్టోరీ గురించి తెలుస్తుంది' అన్నారు. నటి నిహారిక మాట్లాడుతూ, 'దర్శకుడు కథ వినిపించగానే ఒకే చెప్పేశాను. ఈ సినిమా నా కెరీర్‌కు ఎంతో ముఖ్యమని నమ్ముతున్నా. షేన్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది' అన్నారు. దర్శకుడు వాణి మోహన్‌దాస్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. చిత్రీకరణ పూర్తయిన తర్వాత కథ గురించి మాట్లాడుతాను' అన్నారు. హీరో షేన్ నిగమ్ మాట్లాడుతూ, 'చిన్న వయసు నుంచే తమిళ చిత్రాలు చూస్తూ పెరిగా. కేరళలో తమిళ హీరోలకు మంచి ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఉంది. తమిళ చిత్రంలో నటించడం ఎంతో సంతోషంగా ఉంది. ఇలాంటి మంచి అవకాశాన్ని ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు' అన్నారు.

16న విడుదలకు సిద్ధంగా 8 చిత్రాలు

ఫిబ్రవరిలో రెండు శుక్రవారాలు వెళ్లిపోగా, మూడో శుక్రవారమైన ఈ నెల 16న ఎనిమిది చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో జయం రవి హీరోగా నటించిన 'సైరన్' మూవీ. ఈ సినిమా చిన్న చిత్రాల నడుమ రిలీజ్ కానుండటంతో ప్రేక్షకులు ఆదరిస్తారని యూనిట్ సభ్యులు గట్టిగా నమ్ముతున్నారు. ఇందులో జయం రవి సరసన కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్ నటించగా డెబ్యూ డైరెక్టర్ ఆంటోని భాగ్యరాజ్ దర్శకత్వం వహించారు. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం సమకూర్చారు. అలాగే, జీవన్, మల్లికా షెరావత్ నటించిన 'పాంబాట్టం', సంతోష్ పి జయకుమార్ దర్శకత్వం వహించిన 'ది బాయ్స్', 'ఆంధై', 'ఎట్టుం వరై ఎట్టు, 'కళమరమ్', 'పూ పోంద్ర కాదల్, 'ఎప్పోదుం రాజా' వంటి చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సినిమాలన్నీ ప్రకటించినట్టుగా విడుదల అయితే, ఈ యేడాది ఇప్పటివరకు ఒకే రోజున అత్యధిక చిత్రాలు రిలీజ్ అయిన తేదీగా శుక్రవారం నిలిచిపోతుంది.



'సైరన్'లో జయం రవి

తగ్గిన వెల్లుల్లి ధరలు



ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: దిగుమతులు పెరగడంతో వెల్లుల్లి ధరలు తగ్గాయి. పది రోజుల క్రితం కోయంబేడు మార్కెట్లో కిలో వెల్లుల్లి రూ.500కు విక్రయమైంది. ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వెల్లుల్లి 200 టన్నులు దిగుమతి అయ్యింది. దీంతో, కిలో రూ.300కు విక్రయిస్తున్నారు. త్వరలో ధరలు మరింత తగ్గే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.

వండలూరు జూ నుంచి అదృశ్యమైన

హనుమాన్ వానరాలు



ఐసిఎఫ్, ఫిబ్రవరి 14: స్థానిక వండలూరు జులాజికల్ పార్కు నుంచి హనుమాన్ వానరాలు అదృశ్యమయ్యాయి. ఈ పార్కులో 1,500లకు పైగా జంతువులను సంరక్షిస్తున్నారు. జంతువుల పరస్పర మార్పిడి పథకం కింద మరో పార్కు నుంచి వండలూరుకు జంతువులు దిగుమతి చేసుకోవడం, ఇక్కడి నుంచి ఎగుమతి చేయడం జరుగుతుంటుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ జూ పార్కు నుంచి 10 హనుమాన్ వానరాలు, 5 గుడ్లగూబలు, జత హిమాలయ గద్దలు, జత ఈజిప్ట్ గద్దలు గత జనవరిలో దిగుమతి అయ్యాయి. పార్కు ఆసుపత్రి సమీపంలో ప్రత్యేక బోనులో ఉంచిన రెండు హనుమాన్ వానరాలు మంగళవారం బోను నుంచి తప్పించుకొని అడవిలోకి వెళ్లాయి. సిబ్బంది వీటి కోసం గాలిస్తున్నారు.

వీఐటీ ఛాన్సలర్‌కు సాధన అవార్డు


వీఐటీ ఛాన్సలర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 14: స్థానిక కాట్పాడిలో ఉన్న వీఐటీ యూనివర్శిటీలో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ తరపున సాధన సర్టిఫికెట్లను వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు బుధవారం అందజేశారు. గత ఏడాది అక్టోబరు 10, 11 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు అని మొత్తం 856మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడాన్ని గుర్తించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను వీఐటీ ఛాన్సలర్‌కు అందజేశారు. రమణి శంకర్, అడిషినల్ రిజిస్ట్రార్ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'భరత కళాంజలి' వార్షికోత్సవం


కీర్తన రవి భరతనాట్య ప్రదర్శన

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'భరత కళాంజలి' తృతీయ వార్షికోత్సవం ఇటీవల చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులు తమ కళాప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు. వందలాది దరఖాస్తులను పరిశీలించిన మీదట నిర్వాహకులు ప్రతిభావంతులైన కళాకారులను ఎంపిక చేయడం విశేషం. ప్రతిరోజూ హౌస్‌ఫుల్‌గా ఈ ప్రదర్శనలు కొనసాగడం మరో విశేషం. గురువులు ధనుంజయన్, సీపీ సత్యజిత్, శోభనా బాలచంద్ర, అనుపమ సత్యజిత్‌ల మార్గదర్శకత్వంలో సాగిన ఈ ప్రదర్శనలు విమర్శలు ప్రశంసలు అందుకున్నాయి.

గ్లోబల్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల మార్పిడి



విలేకరుల సమావేశంలో వైద్యులు

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పురుగుమందులు కలిపిన పండ్ల రసాన్ని సేవించడంతో తలెత్తిన దుష్ఫలితాల్లో భాగంగా ఊపిరితిత్తుల పాడైన ఓ మహిళకు గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రకాశం జిల్లాకు చెందిన 27 ఏళ్ల మహిళ పురుగుమందు కలిపిన పండ్ల రసం తాగడంతో కాలేయం, ఊపిరితిత్తులు తదితర అవయవాలు దెబ్బతిన్నాయి. అక్కడి ఆసుపత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. ఆమె అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటిలేటర్‌పై ఉంచారు. ఆఖరి ప్రయత్నంగా ఆమె కుటుంబీకులు గ్లోబల్ ఆసుపత్రిని సంప్రదించారు. ఆమెను పరీక్షించిన డాక్టర్ గోవిని బాలసుబ్రమణి నేతృత్వంలోని వైద్య బృందం శస్త్రచికిత్స ద్వారా ఊపిరితిత్తుల మార్పిడి నిర్వహించింది. విలేకరుల సమావేశంలో డాక్టర్ బాలసుబ్రమణితో పాటు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ అపర్ జిందాల్ ఈ వివరాలను వెల్లడించారు.

హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన కారు ప్రమాదంలో తన కుమారుడు వెట్రి దురైస్వామిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న చెన్నై నగర మాజీ మేయర్ సైదై దురైస్వామిని స్థానిక టీ.నగర్ సీఐటీ నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో బుధవారం పరామర్శించి, ఓదార్చిన సూపర్‌స్టార్ రజనీకాంత్





వేడుకలో పాల్గొన్న భక్తులు - ధ్వజస్తంభానికి మహాదీపారాధన చేస్తున్న ప్రధానార్చకులు

తిరుచ్చెందూరు ఆలయంలో మాసి ఉత్సవాల ప్రారంభం

● 23న రథోత్సవం

పెరంబూర్, ఫిబ్రవరి 14: తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువై ఉన్న ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ దివ్యక్షేత్రంగా పేరుగడించిన తిరుచ్చెందూరు సుబ్రహ్మణస్వామి ఆలయంలో మాసి ఉత్సవాలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 12 రోజులపాటు జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం వేకువజాము 1గంటకు ఆలయాన్ని తెరిచారు. వేకువజామున 1.30 గంటలకు విశ్వరూప దీపారాధన, 2 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, 3 గంటలకు ఉదయమార్తాండ దీపారాధన నిర్వహించారు. అనంతరం పతాకాన్ని వెండి పల్లకీలో ఊరేగింపు ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చి, 4.52 గంటలకు ధ్వజారోహణం నిర్వహించారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక అలంకరణ చేసి ఆలయ ప్రధానార్చకులు, శైవాగమ పండితులు కలిసి పతాకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకలకు వందలాదిమంది భక్తులు హాజరయ్యారు. ఆ తర్వాత సాయంత్రం 4.30 గంటలకు అప్పర్‌స్వామి స్వర్ణపురంలో కొలువుదీరి ఊరేగారు. రాత్రి 7గంటలకు పెలినాయకర్ అస్త్రదేవుడితో కలిసి దంతాల పల్లకిలో ఆలయం నుంచి బయలుదేరి నవ సన్నిధులలో ఊరేగి ఆలయానికి తిరిగొచ్చారు. 18వ తేదీనుంచి స్వామివారు వివిధ వాహనసేవల్లో పాల్గొని భక్తులకు కటాక్షించనున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధానమైన రథోత్సవం ఈనెల 23వ తేది జరుగుతుంది. ధ్వజారోహణ వేడుకల్లో తిరువావడుదురై ఆధీనం వేలప్పతంబినాన్ స్వామి, న్యాయమూర్తి వసిత్‌కుమార్, ఆలయ ట్రస్టీలు గణేశన్, డిప్యూటీ కమిషనర్ కార్తిక్, ట్రస్టుబోర్డు సభ్యుడు గణేశన్, ఏరల్ చైర్మన్ సామి ఆలయ వంశపారంపర్య ట్రస్టీ కరుత్తపాండి నాడార్, పళయకడై తిరుపతి తిరువాడుదురై ఆధీనం తిరుచిత్రంబళం తంబిరాన్ స్వామి, హిందూ మున్నాని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీపీ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో భస్మ బుధవారం

● భక్తిప్రపత్తులతో ఉపవాస దీక్షల ప్రారంభం


శాంథోమ్ చర్చిలో భక్తుల నుదుట శిలువ గుర్తు వేస్తున్న ఫాదర్

ప్యారీస్, ఫిబ్రవరి 14: రాష్ట్రవ్యాప్తంగా చర్చీల్లో బుధవారం క్రైస్తవులు ఉపవాసదీక్షలు ప్రారంభించారు. భస్మ బుధవారంగా జరుపుకున్న సందర్భంగా క్రైస్తవ మతపెద్దలు భక్తుల నుదుట భస్మంతో శిలువ గుర్తు వేశారు. లోకరక్షణ కోసం యేసుక్రీస్తు చేపట్టిన శ్రమల కాలాన్ని గుర్తుచేసుకుంటూ ఈ 40 రోజులు ఉపవాసం ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. యేసుక్రీస్తు శిలువపై మరణించిన రోజుకు గుడ్‌ఫ్రైడేగా, పునరుత్థానం చెందిన మూడో రోజును ఈస్టర్ పండుగగా జరుపుకుంటున్నారు. కాగా, ఉపవాస దీక్షల ప్రారంభం రోజు నాగపట్టినం జిల్లాలో ప్రసిద్ధిచెందిన వేలాంకన్ని మేరీమాత బాసలికాలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. క్యాథలిక్, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా, లూథరన్, బాప్టిస్టు, కల్వరీ చర్చీలు, చెన్నైలోని సెయింట్ థామస్ మౌంట్ చర్చి, శాంథోమ్ చర్చి, బీసెంట్‌నగర్ వేలాంకన్ని చర్చి, ప్యారీస్ సెయింట్ ఆంటోని చర్చి, ఎగ్మూర్ పీటర్ చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చీల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు.




భస్మ బుధవారం ప్రార్థనల్లో తెలుగు క్రైస్తవులు

కల్పాక్కం...

చెంగల్పట్టు జిల్లా కల్పాక్కం సమీపంలోని చిన్నకడలూరు కానాను క్యాంపస్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో భస్మ బుధవారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో పలు కమిటీ నిర్వాహకులు, సండే స్కూలు, స్త్రీల సమాజం, యూత్, క్వయర్ బృందాల సభ్యులు ప్రత్యేక గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ ఆలయం తరపున జరుపుకోనున్న ఈస్టర్ ఆరాధన వరకు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, ట్రెజరర్ అనమలగుర్తి బాబు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ముందుగా స్థానిక వెప్పేరి హైరోడ్డులో ఉన్న చర్చి ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రైవేటు బస్సుల్లో కల్పాక్కంకు బయల్దేరి వెళ్లారు.

న్యూ అత్తిపట్టు...

తిరువళ్లూర్ జిల్లా న్యూ అత్తిపట్టులోని కల్వరి బాప్టిస్టు ప్రెయర్ గార్డెన్‌లో డాక్టర్ ఎస్.ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన భస్మ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జీసస్ ప్రెయర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.యేసుదాస్ సహా ఆసియా బాప్టిస్టు పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు, మహిళలు పాల్గొని లోక సంక్షేమార్థం ప్రార్థించారు.


కల్పాక్కంలో భస్మ బుధవారం ఉపవాస దీక్షను ప్రారంభిస్తున్న రాజేంద్ర ప్రసాద్

'మీరు రోడ్డు కింగా'?

ట్రాఫిక్ ఉల్లంఘనలపై షార్ట్ ఫిల్మ్

● విడుదల చేసిన సీపీ

అడయార్, ఫిబ్రవరి 14: 'మీరు రోడ్డు కింగా' అంటూ నగర వ్యాప్తంగా కనిపించిన బ్యానర్లకు నగర ట్రాఫిక్ పోలీసులు గురువారం సమాధానమిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన చోదకుల్లో అవగాహన కల్పించే నిమిత్తం 'మీరు రోడ్డు కింగా?' పేరుతో లఘు చిత్రాన్ని రూపొందించగా, దీన్ని నగర పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. కాగా, ట్రాఫిక్ నియమ నిబంధనలపై వాహనదారుల్లో అవగాహన కల్పించే నిమిత్తం యేటా జనవరి 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రతా మాసాన్ని పాటిస్తున్నారు. ఈ నెల రోజుల ట్రాఫిక్ పోలీసులు వివిధ రకాలైన అవగాహన ప్రచార కార్యక్రమాలను పాఠశాల, కాలేజీ విద్యార్థులు, ఎన్జీవో సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిర్వహిస్తుంటారు. ఇందులోభాగంగానే గత కొన్ని రోజులుగా నగరవ్యాప్తంగా వేలాది సంఖ్యలో 'మీరు రోడ్డు కింగా?' అంటూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. డిజిటల్ బోర్డులపై డిస్‌ప్లే చేశారు. వీటిని చూసిన నగరవాసులు ఇదేం ప్రచారం అంటూ చర్చించుకోవడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రచార బోర్డుల సస్పెన్స్‌కు నగర పోలీసులు తెరదించారు.


రోడ్డు భద్రతపై ద్విచక్రవాహన అవగాహన ర్యాలీ

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

చెన్నై ట్రాఫిక్ విభాగం, ఐసీఐసీఐ లంబార్డ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో రైడ్ టు సేఫ్టీ అనే నినాదంతో రోడ్డు భద్రతపై ఒక అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇందులో సుమారు 500 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ద్విచక్ర వాహనదారులు, ట్రాఫిక్ పోలీసులు, పిల్లలు తల్లిదండ్రులు సుమారు 9 వేల మందికి ఐఎస్ఐ మార్క్ కలిగిన హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టు కింద పది మంది విద్యార్థులకు శిరస్త్రాణాలు అందజేసి బైకు ర్యాలీని కూడా ప్రారంభించారు.